క్లుప్తంగా

రామునికి హనుమంతుసేవ



విశేష పుష్పాలంకరణలో శ్రీరామచంద్రుడు

ఆత్మకూరురూరల్: మండలంలోని ఆరవేడులో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీరామచంద్రుడికి హనుమంత వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు విశేష పుష్పాలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవమూర్తులకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి

ఆత్మకూరురూరల్: మండలంలోని నాగులపాడులో రూ.10 లక్షల వ్యయంతో మంజూరైన సిమెంట్ రోడ్డు పనులకు ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రతిపాదనలు మేరకు మంజూరైన నిధులతో సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగులపాడు సర్పంచ్ సోమవరపు వెంకటరమణారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమత్ గిరీశ్వర కల్యాణం

జలదంకి: బ్రాహ్మణక్రాక పంచాయతీ హనుమకొండపాళెంలో కొలువైన భ్రమరాంబ సమేత హనుమత్ గిరీశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. శివపార్వతుల ప్రతిమలను సుందరంగా అలంకరించి కల్యాణ వేదికపై ఉంచి వేద పండితుల మంత్రోచ్చరణాలు, మేళతాళాలు, భక్తుల కోలాహలం నడుమ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. ఉదయం బలిహరణ, గ్రామోత్సవం నిర్వహించారు. కల్యాణ ఉభయకర్తలుగా కిష్టిపాటి లోకేష్–సుప్రజ, భాస్కర్‌రెడ్డి–ప్రభావతి, శ్రీకాంత్–గాయత్రి దంపతులు వ్యవహరించారు.

అంకాలమ్మ ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

చేజర్ల(సోమశిల): అంకాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతసాగరం మండలం గౌరవరంలో కొలువైన అంకాలమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. కంచి కామకోటి పీఠాధిపతుల మఠం వేద పండితులు నిడిగంటి సతీష్ శశిధర్ శర్మ పర్యవేక్షణలో వేద పండితులు మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. నవగ్రహ మండపారాధన, గణపతి రుద్రశాంతి హోమాలు నిర్వహించారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వాటర్ ట్యాంక్ కూలి మహిళకు గాయాలు

అల్లూరు: వాటర్ ట్యాంక్ కూలీ మహిళపై పడడంతో తీవ్రంగా గాయపడిన ఘటన స్థానిక రామకృష్ణా జూనియర్ కళాశాల శుక్రవారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. రామకృష్ణా జూనియర్ కళాశాల రెండో అంతస్తుపై ఉన్న వాటర్ ట్యాంక్ కూలీ పక్కనే ఉన్న రోడ్డు మీద పడింది. అక్కడే పక్కన చిన్న దుకాణం నడుపుతున్న పాల ప్రసన్న అనే మహిళపై వాటర్ ట్యాంక్ ఇటుకలు పడడంతో గాయాలయ్యాయి. ఆమెను 108 వాహనంలో అల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటన జరిగిన కొద్ది క్షణాల ముందు వరకు కూడా చిన్న పిల్లలు అక్కడే ఆడుకుటుంటూ ఉండన్నారు. ఆ సమయంలో ఈ ఘటన జరిగి ఉంటే పెను ప్రమాదమే జరిగి ఉండేదని బాధితురాలు తెలిపింది.

ఘనంగా అన్నాభిషేకం



ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జలాశయ ఆవరణలో కొలువైన సిద్ధేశ్వరస్వామి ఆలయంలోని శివలింగానికి శుక్రవారం భక్తులు ఘనంగా అన్నాభిషేకం చేశారు. అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, గణపతి పూజ నిర్వహించారు. అన్నాభిషేకంతో మోక్షం, దీర్ఘాయుష్షు కలుగుతుందనేది నమ్మకం. అర్చకులు ఎల్‌వీ ప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే ఇంటికే

- ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని బాధ్యతగా నిర్వహించండి
- జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ దయాకర్
- డివిజన్ స్థాయిలో ఆరోగ్య సిబ్బందితో డీఎంహెచ్‌ఓ సమీక్ష



అనంతసాగరం పీహెచ్‌సీ డాక్టర్, సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రశ్నిస్తున్న డాక్టర్ దయాకర్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే ఫ్యామిలీ డాక్టర్ పథకంతో గ్రామ స్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించితే కొందరు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తప్పవని ఫ్యామిలీ డాక్టర్ పథకం జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ దయాకర్ అన్నారు. ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌స్థాయిలో పలు మండలాల పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, సూపర్ వైజర్లతో డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్యతో కలిసి మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. తొలుత పలు మండలాల పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది నమోదు చేస్తున్న రికార్డులను తీసుకుని రావాలని సూచించారు. అనంతసాగరం పీహెచ్‌సీ డాక్టర్‌తో పాటు సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారిపై మండి పడ్డారు. లక్షలాది రూపాయల జీతాలు తీసుకుంటూ ప్రభుత్వం నిర్దేశించిన ఆరోగ్య పథకాల అమలు విషయంలో బాధ్యతారాహిత్యంగా, ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. ఇలాంటి వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చినా పట్టించుకోవడం లేదని, సస్పెండ్ చేయక తప్పదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంతో పోలిస్తే పీహెచ్‌సీ కేంద్రాల సంఖ్య పెరిగిందని, పీహెచ్‌సీల పరిధిలో జనాభా సైతం తగ్గి విధుల్లో ఒత్తిడి లేకున్నా ఇంకా నిర్లక్ష్యంగా ఎలా వ్యవహరిస్తారని మండిపడ్డారు. ఏఎస్‌పేట పీహెచ్‌సీ సిబ్బంది సైతం ఏ ఒక్క రికార్డు పూర్తిస్థాయిలో నమోదు చేయకపోవడం, ఎన్‌సీడీ సర్వే ఏడాదిన్నర క్రితం మొదలు పెట్టినా దాని వివరాలు అందించకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానన్నారు.

నిర్లక్ష్యాన్ని క్షమించలేం

వైద్య సిబ్బంది నిర్లక్ష్యాన్ని క్షమించలేమని, ముందుగా సమాచారం ఇచ్చి రికార్డులు, డైరీ తీసుకుని రావాలని సూచించినా పట్టించుకోకుండా సమీక్షలకు రావడం ఏమిటని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మంచి ఫలితాలు సాధించడంలో, మెరుగైన వైద్య సేవలు అందించడంలో మొదటి ఐదు స్థానాల్లో నెల్లూరు జిల్లా ఉందని అలాంటి మంచి పేరును చెడిపోకుండా పీహెచ్‌సీల సిబ్బంది వ్యవహరించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక డాక్టర్‌తో పాటు సిబ్బంది, 72 రకాల మందులు వారి వెంట తీసుకొని ముఖ్యమైన పరీక్షలు సైతం నిర్వహిస్తూ వైద్యసేవలు అందించేలా ప్రోగ్రామ్ రూపొందించినట్లు ఆయన తెలిపారు. పీహెచ్‌సీలో కేవలం రెండో సారి కాన్పులు అయ్యే వారికే కాన్పులు చేయాలని సూచించినట్లు, డివిజన స్థాయి ఆసుపత్రుల్లో అన్ని వసతులు ఉండడంతో అక్కడకు కాన్పులకు వచ్చే వారిని పంపాలని సిబ్బందికి సూచించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ వెంకటకృష్ణ, అన్ని పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గరుడ వాహనంపై నృసింహుడు



గరుడ వాహనంపై నృసింహుడు

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు మండలం నల్లగొండ్ల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ ఆవరణలోని యాగశాలలో వేదపండితులు గరుడ గాయత్రి, నరసింహ గాయత్రి, లక్ష్మీగాయత్రి హోమాలు నిర్వహించారు. వీరాంజనేయ స్వామి వారికి సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీవారిని గరుడ వాహనంపై ఉంచి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారు శంఖు చక్ర గదాధారియై గజేంద్రమోక్ష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బాణసంచా పేలుస్తూ మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం కనుల పండువలా సాగింది. ఉభయ కర్తలుగా నల్లగొండ్ల దక్షిణపు వీధివారు వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ అన్నపురెడ్డి మోహన్ రెడ్డి పర్యవేక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భారీగా అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శనివారం స్వామి వారు గజవాహనంపై కల్యాణ నారసింహుడిగా దర్శనమివ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు.

మత్స్యకార గ్రామాల అభివృద్ధి



లబ్ధిదారుడికి బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పక్కన పరిశీలకుడు బాబురావు

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: నియోజకవర్గంలోని మత్స్యకార గ్రామాలు అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కావలి మండలం పెద్దపట్టపుపాళెంలో శుక్రవారం కావలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు కదిరి బాబురావుతో కలిసి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పలకరించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఆయా కుటుంబాలు అందుకున్న సంక్షేమ పథకాల లబ్ధిని వారికి వివరించారు. అనంతరం వారికి సంక్షేమ పథకాల బుక్‌లెట్స్‌ను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారుల కుటుంబాలు ఇబ్బందులు పడకూడదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయం చేస్తున్నారని చెప్పారు. జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తి కావస్తుందని, త్వరలో దానిని ప్రారంభించేందుకు సీఎం కావలికి వస్తారని చెప్పారు. ఈ ఫిషింగ్ హార్బర్ వల్ల నియోజకవర్గంలోని మత్స్యకారులకు జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వసల పోకుండా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. హార్బర్‌ను ప్రాతిపదికగా చేసుకుని మన మత్స్యకారులు స్థానికంగా చేపలు వేట చేయడం వల్ల, ప్రత్యక్షంగా వారికి, పరోక్షంగా మత్స్య సంపదపై ఆధారపడి ఇతర జీవనోపాధి పనులు చేసుకుంటున్న వారికి పాధి అవకాశాలు పుష్కలంగా అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు జంపాని రాఘవులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

'కలికి' ఆశయాలే స్ఫూర్తి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



కలికి యానాదిరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నాయకులు

కావలి: ప్రజలకు సేవ చేయడంలో మాజీ మంత్రి కలికి యానాదిరెడ్డి ఆశయాలే స్ఫూర్తిగా తీసుకుని ఆయన బాటలోనే పయనిస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలికి యానాదిరెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కావలిలోని కలికి యానాదిరెడ్డి అభిమానులు ప్రతినిధి కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి, ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న కలికి యానాదిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగు సార్లు కావలికి ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా సేవలు అందించిన కలికి యానాదిరెడ్డి ఆర్భాటాలకు దూరంగా ఉండి ప్రజలకు సేవలు అందించాడని గుర్తు చేశారు. నీతి నిజాయితీ విలువతో కూడిన నాయకుడిగా ప్రజల్లో గౌరవాభిమానాలు సంపాదించుకున్న కలికి యానాదిరెడ్డిని ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు జంపాని రాఘవులు, కనమర్లపూడి వెంకటనారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, కుందుర్తి కామయ్య, కుందుర్తి సునీత, ఈతముక్కల బాలమురళీరెడ్డి, గంధం ప్రసన్నాంజనేయుడు, షేక్ నాయబ్ రసూల్, దండా కృష్ణారెడ్డి, కనుపర్తి రాజశేఖర్, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, చేవూరు పద్మ, గుర్రం వెంకటేశ్వర్లు, నీలం సాయి కుమార్, తిరువీధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శనివారం నుంచి మూడు రోజుల పాటు మర్రిపాడు మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన క్యాంప్ కార్యాలయం అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం 6న అల్లంపాడు సచివాలయం పరిధిలోని ఖాదర్‌పూర్‌లో సాయంత్రం 4.30 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. 7, 8 తేదీల్లో మండలంలోని పడమటినాయుడుపల్లి సచివాలయం పరిధిలో సాయంత్రం 4.30 గంటల నుంచి నిర్వహిస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కో–ఆర్డినేటర్లు, కన్వీనర్లు, గృహసారథులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

పొదుపు గ్రూపుల వీఓఏలకు అవగాహన

కొండాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పొదుపు సంఘాల వీఓఏలకు లోకోస్ యాప్‌పై అవగాహన కల్పించారు. మండల ఇన్‌చార్జి ఏపీఎం మనోహర్ మాట్లాడుతూ ఒకే యాప్ ద్వారా పొదుపు గ్రూపుల పనులు చేయాల్సి ఉంటుందన్నారు. గతంలో పొదుపు సంఘాలకు సంబంధించి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రాలు ప్రత్యేక యాప్‌ల ద్వారా సేవలు కొనసాగించే వారన్నారు. ఇప్పుడు లోకోస్ యాప్‌ను దేశ వ్యాప్తంగా వాడేలా తీసుకువచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీ కాంతారావు, వీఓఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం నందవరం మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి ఐదో తరగతి పాసైన ఆసక్తి కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ పేట శ్రీనివాసులురెడ్డి, శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. apms.ap.gov.inలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. తమ దరఖాస్తులను మే 9 నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. 2023 జూన్ 11న దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు నందవరం మోడల్ స్కూల్‌లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ



చెర్లోయడవల్లిలో రికార్డులు పరిశీలిస్తున్న ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాసులు

ఆత్మకూరురూరల్: మండలంలోని చెర్లోయడవల్లి సచివాలయాన్ని ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాసులు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించి వలంటీర్లు విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యంగా ఉండడంపై వారిని హెచ్చరించారు. వారంలో మూడు రోజుల ప్రతి వలంటీరు తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం నాడు–నేడు పథకం ద్వారా చెర్లోయడవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేపట్టిన నిర్మాణాలు, రావులకొల్లులో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు, తదితర తరాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సంపూర్ణ, శాంతి, రూపేష్, జయచంద్ర, ఇంజినీరింగ్ సహాయకులు ఏడుకొండలు, ప్రధానోపాధ్యాయులు మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు వరం ఉపాధి హామీ పథకం



పొంగూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకట్రావు

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించడంతో పాటు గిట్టుబాటు కూలి దక్కే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలకు వరమని జిల్లా డ్వామా పీడీ వెంకట్రావు అన్నారు. మర్రిపాడు మండలం పొంగూరులో ఉపాధి హామీ పథకం కింద బటకర్లకుంట ఉపాధి పనులను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ సమయపాలన పాటిస్తూ ఉపాధి పనులు చేసుకుంటే రూ.272 కూలి దక్కుతుందన్నారు. అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు సకాలంలో పూర్తి చేస్తే కూలి నగదు తమ బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా జమ అవుతాయని తెలిపారు. వేసవి ఎండలు దృష్ట్యా వీలైనంత త్వరగా ఉదయం పూట పనులు పూర్తి చేయాలన్నారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్‌లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, తాగునీరు కూలీలకు అందుబాటులో ఉంచాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులకు ఉపాధి పనుల్లో తొలి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జాబ్‌కార్డులు లేని కుటుంబాలకు సత్వరం వివరాలు సేకరించి ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్ ఖాన్, ఉపాధి హామీ ఏపీఓ సునీల్, టీఏ కడెం వంశీ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉర్లగంటి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక రుగ్మతలు దూరం



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న పిరమిడ్ మాస్టర్ ఇందుమతి

ఆత్మకూరు: ప్రతి రోజు క్రమం తప్పకుండా ధ్యానం చేస్తూ ఉంటే మానసిక రుగ్మతలు దరిచేరవని శాస్త్రీయంగా ఇది నిరూపితమైందని పిరమిడ్ ధ్యాన మాస్టర్ బి.ఇందుమతి అన్నారు. పట్టణంలోని షిరిడీ సాయి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో శుక్రవారం స్పిరిచ్యువల్ ధాన్య తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అనేక రకాల ఒత్తిడులతో మానవులు ఇబ్బందులు ఎదుర్కొంటూ రోగాలను తెచ్చుకుంటున్నారన్నారు. దీనికి విరుగుడు ధ్యానమేనని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు డాక్టర్ సి సుబ్రహ్మణ్యం, విజయమ్మ దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేత్రపర్వం.. నృసింహ కల్యాణం



పెంచల లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం నిర్వహించిన వేదపండితులు

ఆత్మకూరు: నృసింహ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో బొగ్గేరు వద్ద కొలువైన చెంచులక్ష్మీ సమేత పెంచలస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామి వారి గర్భాలయంలో మూలవిరాట్‌లను విశేష ద్రవ్యాలతో అభిషేకించి సుందరంగా అలంకరించారు. భక్తులు ఉదయం నుంచే స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. పెంచలస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపం ప్రారంభించి అక్కడే తొలిసారిగా స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు కల్యాణ ఘట్టాలను వివరిస్తూ నృసింహస్వామి ఆవిర్భావ చరిత్రను భక్తులకు వివరించారు. కల్యాణ ఉభయకర్తలుగా ఈశ్వరమ్మ, ప్రభాకర్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు. అనంతరం భారీస్థాయిలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

జగనన్న విద్యా కానుక శాంపిల్ కిట్ పరిశీలన



జలదంకి ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్‌ను చూపుతున్న అధికారులు

జలదంకి: జలదంకి ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం నుంచి వచ్చిన జగనన్న విద్యా కానుక శాంపిల్ కిట్‌ను ఎంఈఓ శ్రీధర్, ఐకేపీ ఏపీఎం శ్రీధర్‌రావు శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 1వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కింద కిట్‌లు అందిస్తామన్నారు. ప్రతి కిట్‌లో మూడు జతల యూనిఫాం క్లాత్, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, షూ– 2 జతల సాక్స్‌లు, స్కూల్ బ్యాగ్, బెల్ట్ ఉంటాయన్నారు. యూనిఫాం కుట్టించేందుకు అయ్యే ఖర్చులను తల్లుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జలదంకి కాంప్లెక్స్ హెచ్‌ఎం కొండారెడ్డి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



ఆత్మకూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: వేసవి సెలవులను వృథా చేసుకోకుండా తమ పిల్లలను గ్రంథాలయానికి పంపేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని, ఆత్మకూరు శాఖ గ్రంథాలయ అధికారి ఓ శ్రీనివాస రాజు కోరారు. పట్టణంలోని గ్రంథాలయంలో శుక్రవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు సమ్మర్ క్యాంపు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ ప్రత్యేక క్యాంపులో కథల పుస్తకాలు, చెస్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ అసిస్టెంట్ తనూజ తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి అధిక ప్రాధాన్యం

- ఏపీడీ నిర్మలాదేవి



దాసరపల్లిలో అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న ఏపీడీ నిర్మలాదేవి

ఉదయగిరి: 2023–24 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో జిల్లాలో పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ నిర్మలాదేవి తెలిపారు. ఆమె శుక్రవారం మండలంలోని దాసరపల్లి, కొండాయపాళెంలో పండ్ల తోటలు, అవెన్యూ ప్లాంటేషన్, మిషన్ అమృత్ సరోవర్ పనులను పరిశీలించారు. అనంతరం స్థానిక స్త్రీశక్తి భవనంలో సిబ్బందితో పనులపై సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 700 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, మండలానికి కేటాయించిన లక్ష్యాలు పూర్తి చేయాలని సూచించారు. పండ్ల తోటల పెంపకం ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులు సన్న కారు, భూసార పరీక్ష ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఉపాధి హామీకి సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఓ వెలుగోటి శ్రీనివాసులు, టీఏలు ప్రసన్న, రమణ, తదితరులున్నారు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం



సంగంలో భారీ వర్షానికి జలమయం అయిన రోడ్డు



కావలిలో కురుస్తున్న భారీ వర్షం

సంగం: మండలంలో ఉరుములు, మెరుపులతో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ వేడిమితో ఉన్న వాతావరణం మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు, మెరుపులు దడ పుట్టించాయి. భారీ వర్షం కురిసింది. దీంతో సంగం శివాజీ సెంటర్, సాయినగర్ ప్రాంతాల్లో భారీగా వర్షపు నీరు రోడ్లపై చేరింది. మధ్యాహ్నం ప్రారంభమైన వర్షం సాయంత్రం వరకు కురుస్తూనే ఉంది.

ఏఎస్‌పేటలో..

అనుమసముద్రంపేట: మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం భారీ వర్షం కురవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది.

ఉరుముల వాన

కావలి: పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం ఒక గంట పాటు ఉరుములతో కూడిన వర్షం పడింది. ఈ నెల 7 తర్వాత తుఫాన్ ఉంటుందని వాతావరణశాఖ తెలియజేస్తున్న క్రమంలో సెగలు కక్కుతూ ఎర్రటి ఎండ కాస్తున్న సమయంలో ఒక్కసారిగా కావలిలో వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. అడపాదడపా ఉరుములు శబ్దాలు చేస్తూ గంట పాటు కురిసిన వర్షం కువడంతో పట్టణంలోని వీధులు జలమయయ్యాయి. వర్షం ఆగినప్పటికీ ఆకాశం మేఘావృతంగా ఉంది.